

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈనెల 7న సరూర్‌నగర్ స్టేడియంలో బీజేపీ బహిరంగసభ నిర్వహించనున్న దృష్ట్యా ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డిలు స్థల పరిశీలన చేశారు. మధ్యాహ్నం సరూర్‌నగర్ స్టేడియానికి వచ్చిన వారు స్టేడియం కలియతిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి(అర్బన్), బొక్క నర్సింహారెడ్డి(రూరల్), కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, ఆకుల శ్రీవాణిఅంజన్, జీవన్‌రెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, సురేందర్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందెల శ్రీరాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

సీఎం సహాయనిధి పేదలకు వరం

● జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరమని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ ఓల్డ్ విలేజ్‌కు చెందిన పుటరి సంతోష్ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకున్న తర్వాత ఆర్థిక పరిస్థితులు బాగలేక స్థానిక కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయడంతో రూ.60వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును ఆదివారం రాజశేఖర్‌రెడ్డి సంతోష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పలుసం శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు సుంకోజు కృష్ణమాచారి, కందికంటి శ్రీధర్‌గౌడ్, భాగ్యనగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాము, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో స్వర్ణ, రజత పతకాలు సాధించిన విద్యార్థులు



పతకాలు సాధించిన భారతదేశ విద్యార్థులు

చంపాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరుగుతున్న మలేషియా ఓపెన్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో భారత్‌కు చెందిన విద్యార్థులు నాలుగు స్వర్ణాలు, మూడు రజతం, మూడు కాంస్య పతకాలు సాధించినట్లు భారతదేశం అండర్ 19 కోచ్ ఆర్.రాజునాయక్ తెలిపారు. రామావత్ శాన్వినాయక్ స్వర్ణం, కాంస్యం, చేపల కిషోర్ స్వర్ణం, కాంస్యం, ప్రవీణ్ స్వర్ణం, సందీప్‌కుమార్ రజతం, కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు ఎల్బీనగర్ ఇతర ప్రాంతాలకు చెందిన వారని, మరో నాలుగు రోజుల్లో వారు భారత్‌కు రానున్నట్లు రాజునాయక్ తెలిపారు.

ఉత్సాహంగా చీఫ్ మినిస్టర్ కప్ 2కె రన్

ఎల్‌బీనగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం చీఫ్ మినిస్టర్ కప్ 2కె రన్ నిర్వహించారు. రన్‌ను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ రన్‌లో ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో పాటు క్రీడాకారులు, వివిధ విభాగాల ఉద్యోగులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు పెద్దఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వ్యాస రచన పోటీలు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు మండల స్థాయి వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, ఎంఈవో జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 145 మంది విద్యార్థులు వ్యాస రచన పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన 15 మంది విద్యార్థులకు తహసీల్దార్, ఎంపీడీవో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రమేష్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల మేధాశక్తికి వ్యాసరచన పోటీలు దోహదం

మన్సూరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మేధాశక్తికి వ్యాసరచన, ఉపన్యాసం పోటీలు ఎంతగానో దోహదపడతాయని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మండలస్థాయి వ్యాసరచన పోటీలకు కార్పొరేటర్‌తో పాటు హయత్‌నగర్ తహసీల్దార్ జానకి, ఎంఈఓ శ్రీనివాస్‌లు సైతం పాల్గొన్నారు. ఈసందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రూ.5వేల నగదు బహుమతిని వారు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దినేష్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇందిర, దుర్గలత, ఏఏపీసీ కమిటీ చైర్మన్ మమత, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, బీజేవైఎం నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు, కుంటలను కాపాడుకుందాం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ ముదిరాజ్ సంఘం జనరల్ బాడీ సమావేశం అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చెరువు, కుంటలు కబ్జాలపాలు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెరువులను రక్షించుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమేష్‌ను సంఘం సభ్యులు సన్మానించారు.

క్రెడిట్ కార్డుపై ఇంటర్నేషనల్ ట్రాన్సాక్షన్ సర్వీసెస్ ఉన్నాయంటూ మోసం

● రూ1,33,650 దోచుకున్న సైబర్ మోసగాళ్లు

కొత్తపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డుపై ఇంటర్నేషనల్ ట్రాన్సాక్షన్ సర్వీసెస్ ఉన్నాయంటూ ఓ హోటల్ రిసెప్షనిస్టుకు చెందిన క్రెడిట్ కార్డుల నుంచి సైబర్ మోసగాళ్లు రూ1,33,650 దోచుకున్నారు. ఈ సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవేంద్రనగర్‌కాలనీలో ఉండే వేణుగోపాల సాయి(30) ఓ హోటల్‌లో రిసెప్షనిస్టు. నవంబర్ 30వ తేదీన రాత్రి 12గంటలకు అతడికి గుర్తు తెలియని వ్యక్తి 8618145547 నంబరు నుంచి కాల్ చేశాడు. అతడి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు పై ఇంటర్‌నేషనల్ ట్రాన్సాక్షన్ సర్వీసెస్ ఉన్నాయని, అదనపు ఛార్జీలు పడకుండా సదరు ఫీచర్‌ను ఎస్‌బీఐ యాప్ ద్వారా తొలగించండి అని గుర్తు తెలియని వ్యక్తి సూచించారు. నిజమే ఉండవచ్చని భావించిన వేణుగోపాల సాయి ఎస్‌బీఐ యాప్ ఓపెన్ చేస్తే ఆ ఫీచర్ కనిపించలేదు. తర్వాత గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్‌లో ఓ యాప్‌ను షేర్ చేయడంతో వేణుగోపాల సాయి ఇన్‌స్టాల్ చేసి, అందులో తన క్రెడిట్ వివరాలు అందజేశాడు. ఆ తర్వాత అతడి ఎస్‌బీఐ, ఐసీఐసీఐ క్రెడిట్ కార్డుల నుంచి రూ1,33,650 బదిలీ అయ్యాయని గుర్తించాడు, వెంటనే 1930 టోల్ ఫ్రీ నెం ద్వారా ఫిర్యాదు చేయడంతో ఎల్బీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

హయత్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన కంపాటి విష్ణు(17) స్థానిక వర్డ్ అండ్ డీడ్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. కళాశాలకు వెళ్తున్నానని విష్ణు శనివారం ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంత వరకు రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు కళాశాలకు వెళ్లి విచారించగా విష్ణు కళాశాలకు రాలేదని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు స్నేహితుల వద్ద, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం విష్ణు తండ్రి భాస్కర్ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ గ్యారెంటీల గారడీ.. 6 అబద్ధాలు.. 65 మోసాలు

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘాటైన విమర్శలు



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, పక్కన బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తదితరులు

చాదర్‌ఘాట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల గారడీ, 6 అబద్ధాలు, 65 మోసాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఆదివారం దిల్‌సుఖ్‌నగర్‌లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల వేళ 100 రోజుల్లో 6 గ్యారెంటీలు, ఏడాదిలో 66 వాగ్దానాలు, 5 ఏళ్ల పదవి కాలంలో మ్యానిఫెస్టో హామీలను నెరవేరుస్తామని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో ఏ ఒక్క గ్యారెంటీని పూర్తి స్థాయిలో అమలు చేయక ప్రజలను వంచించిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, డిక్లరేషన్లన్నీ నీటి మీది రాతలే అన్నారు. లగచర్లలో భూసేకరణ పేరిట రైతులపై అక్రమ కేసులు పెట్టి పోలీసులచే దాడులు చేయించడం కాంగ్రెస్ మార్క్ ప్రజాస్వామ్య పాలనా అని ఆయన ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ దాదాపు 19వేల ఎకరాల్లో ఫార్మా సిటీ కడతాం అని చెప్పినప్పుడు ఇదే రేవంత్‌రెడ్డి ఆనాడు ఏం మాట్లాడారో గుర్తు చేసుకోవాలన్నారు. భూసేకరణ పేరిట అన్యాయంగా పేదల ఇండ్లు కూలగొడుతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల దగ్గర బలవంతంగా భూములు గుంజుకుంటే ఖబడ్దార్ అని ఎంపీ ఈటల హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ మాదిరిగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. నియామక పరీక్షలపై ఆందోళన వ్యక్తం చేసిన నిరుద్యోగులపై చేసిన దాడులు ప్రజల ఆకాంక్షలా అని ఆయన ప్రశ్నించారు. దీనికి తోడుగా హైడ్రా, మూసీ ప్రక్షాళన. తెలంగాణ ప్రజలు 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో అనుభవించిన కష్టాలను ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వంలో అనుభవించారన్నారు. రేవంత్ మర్చిపోయిన వాగ్దానాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు బీజేపీ ముందుకొచ్చిందన్నారు. పేద ప్రజలకు బీజేపీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, సురేందర్‌యాదవ్, కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కళ్లెం జీవన్‌రెడ్డి, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

జీఓ 118 ద్వారా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు ఎమ్మెల్యే కృషి

● కొందరు ఐక్యవేదిక పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం తగదు

● బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ 118 జీఓ కాలనీల సంక్షేమ సంఘం ఫోరం



సమావేశంలో ప్రసంగిస్తున్న బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

మన్సూరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జీఓ 118 అమలును నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం జీఓను మళ్లీ పునరుద్ధరించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ 118 జీఓ కాలనీల సంక్షేమ సంఘం ఫోరం సభ్యులు కోరారు. ఎస్‌కేడీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐక్యవేదిక పేరుతో కొన్ని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కొందరు కాలనీవాసులతో కలిసి జీఓ 118కు అర్హత గల వారిని భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. నియోజకవర్గం పరిధిలోని జీఓ 118 కిందకు వచ్చే ప్రతి ఇంటిని, స్థలాలను స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రిజిస్ట్రేషన్ చేయించేందుకు గత ప్రభుత్వం హయాంలోనే తీవ్రంగా కృషి చేసి అప్పటికే కొన్నింటిని రిజిస్ట్రేషన్ చేయించారని, ఈ క్రమంలోనే ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడం కారణంగా జీఓను తీసివేశారన్నారు. జీఓ 118 కిందకు వచ్చే ప్రతి ఇంటిని, ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేను ఇప్పుడు కొందరు లోపభూయిష్ట జీఓ తీసుకువచ్చాడని విమర్శించడం సరికాదన్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వంతో పోరాడైనా సరే జీఓ 118ను పునరుద్ధరింపజేసి రిజిస్ట్రేషన్లు చేయిస్తానని ఇటీవల ఎమ్మెల్యే పేర్కొన్నారని, ఇందుకు ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యేపై విమర్శలకు పోకుండా సహకరించాలని వారు కోరారు. ఎంపీగా ఉన్న సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, నాడు ఎంపీగా రేవంత్‌రెడ్డి గెలుపులో కీలకపాత్ర పోషించిన ఎల్బీనగర్ ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల అధ్యక్షులు, సభ్యులు సుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, రాంబాబు, కృష్ణారెడ్డి, ముత్యంరావు, సతీష్, జగన్మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

118 జీవోతో మోసపోయాం

● బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ జీవో 118 బాధితుల ఐక్యవేదిక



మాట్లాడుతున్న జీవో 118 ఐక్యవేదిక సభ్యులు

వనస్థలిపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 118 పేరుతో తమని మోసం చేసిందని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ 118 జీవో బాధితుల ఐక్యవేదిక ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాగర్‌కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ 118 జీవో బాధితుల ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడారు. గత ప్రభుత్వం జీవో నంబరు 118లో స్ట్రక్చరల్ రెగ్యులరైజేషన్ అని జీవో ఇచ్చి ఖాళీ స్థలాన్ని రెగ్యులరైజ్ చేసినట్లుగా కన్వేయన్స్ డీడ్ ఇవ్వడం మోసం కాదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇచ్చిన కన్వేయన్స్ డీడ్‌కు చట్టబద్ధత లేనందున జాతీయ బ్యాంకులు లోన్లు ఇవ్వకపోవడాన్ని ఇది మోసమా? కాదా అన్నారు. 118 జీవో ప్రకారం గజానికి రూ.250 చెల్లించిన తర్వాత కూడా 22-ఎ అనే నిబంధన తొలగించకుండా మోసం చేశారని ప్రశ్నించారు. కన్వేయన్స్ డీడ్ పొందినప్పటికి ఇంటి పన్ను, నీటి బిల్లులు రెండింతలు రావడం దేనికి సంకేతం అన్నారు. అన్ని రకాల ప్రభుత్వ అనుమతులతో హుడా అనుమతించినటువంటి లేఅవుట్లలో కష్టపడి పైసా, పైసా కూడగట్టి కొన్న ప్లాట్లను కబ్జాచేసి ఇల్లు కట్టుకున్నట్లుగా చిత్రీకరించడం మోసమే కదా అన్నారు. ఒక్క పైసా చెల్లించకుండానే 22-ఎ నిబంధన సమస్యకు పరిష్కారం చూపిస్తామని పెద్ద నాయకులు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోవడం దేనికి సంకేతం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 118 జీవోలో ఉన్న సమస్యలను తొలగించి మాకు న్యాయం చేయాలని వారు కోరారు. ఐక్యవేదిక ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పెంటారెడ్డి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

● బీఆర్ఎస్‌కు టీపీసీసీ సూచన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు

చాదర్‌ఘాట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక గురుకులాల్లో జరిగిన ఘటనలను ఆధారంగా చేసుకుని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం మలక్‌పేట సలీంనగర్‌లో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ షకీల్, కాంగ్రెస్ మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకుడు మహేష్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నియమించిన వంట సిబ్బంది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఉన్నతాధికారిగా పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాదా అని ప్రశ్నించారు. అప్పట్లో నియమించిన సిబ్బందితో పొరపాట్లు చేయిస్తూ రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారని, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా చూసుకుంటామని ప్రకటించి, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ పాఠశాల స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్య వరకు చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులను పరిరక్షించుకోవడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించిందన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు ధైర్యంగా ఉండాలని, ఎవరైనా కక్ష సాధింపు చర్యగా భోజనాన్ని కలుషితం చేసి విద్యార్థుల జీవితాల్లో చెలగాటమాడేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అందుకు విద్యార్థులకు అండగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.



తిరుపతి పద్మావతి అమ్మవారికి ప్రతియేటా సమర్పించిన విధంగానే ఆదివారం తిరుచానూరు అఖిల భారత పద్మశాలీ సత్రం అధ్యక్షుడు జెల్ల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పద్మావతి అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు జానకీదేవి, బీసీ కార్పొరేషన్ చైర్మన్ అబద్దయ్య, తిరుచానూరు అఖిల భారత పద్మశాలీ అన్న సత్రం ధర్మకర్త రావిరాల సంధ్యారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ వద్ది శివసత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బడుగుదానయ్య, అఖిల భారత పద్మశాలీ అన్నసత్రాల మార్గదర్శకులు సిలివేరు కాశీనాథ్, మాజీ అధ్యక్షుడు మునగపాటి వెంకటరత్నం, భద్రాచలం అన్నసత్రం అధ్యక్షుడు గోశిక యాదగిరి, మాజీ అధ్యక్షుడు మిరియాల సోమయ్య పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

సీసీఎంబీ పరిశోధనా విద్యార్థి బైనాక్యులర్ చోరీ

బర్కత్‌పురా, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణం చేస్తున్న సీసీఎంబీ పరిశోధన విద్యార్థి బైనాక్యులర్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటలో నివాసముంటున్న పునీత్ పవన్‌కుమార్ సీసీఎంబీలో పరిశోధనా విద్యార్థి. ఏపీలోని రైల్వే కోడూరులో పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి నగరానికి వస్తున్నాడు. ఆదివారం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న పవన్‌కుమార్ బ్యాగులో ఉన్న బైనాక్యులర్ కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన అతను కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

నాదర్‌గుల్‌లో మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

● వైభవంగా పదునెట్టాంబడి మహా పడిపూజ

సరూర్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో ఆదివారం గడ్డం బుచ్చిరెడ్డి గురుస్వామి పదునెట్టాంబడి సందర్భంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజోత్సవం వైభవంగా నిర్వహించారు. తోట యెట్టారెడ్డి గార్డెన్స్‌లో జరిగిన ఈ పూజకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భజనలు చేయడంతో నాదర్‌గుల్ అయ్యప్ప నామస్మరణతో మార్మోగిపోయింది. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని అయ్యప్ప ఆశీస్సులు అందుకున్నారు. పలువురు గురుస్వాములు, ఇతర స్వాములు, పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి అమావాస్య పూజలు

మన్సూరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం మన్సూరాబాద్ డివిజన్ శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలోని కాశీవిశ్వేశ్వరుడికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్ యాదవ్ ఆధ్వర్యంలో పండితుడు బాలమురళీశర్మ వేదమంత్రోచ్చరణల నడుమ ఆ మహాశివుడికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు హన్మంతరావు, రమేష్, రవి, మురళీ, అశోక్, రమణమూర్తి, అజయ్, లక్ష్మయ్య, కేశవులు, రాందాస్, మహిళలు పాల్గొన్నారు.

గౌడ శెట్టి బలిజల వనభోజన మహోత్సవం

మన్సూరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో గౌడ శెట్టిబలిజ కులస్థుల కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ విచ్చేసి మాట్లాడుతూ కులాలు సంఘటితంగా ఉన్నప్పుడే అన్ని రంగాలలో రాణించగలరన్నారు. గౌడ శెట్టి బలిజ కుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బిఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు సదాశివుడు, నర్సింహా యాదవ్, పాశం అశోక్ గౌడ్, గౌడ, శెట్టి బలిజ సంఘం అధ్యక్షులు పీవీవీ సత్యనారాయణ, ప్రతినిధులు పంపన వెంకటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్తీక మాస వనభోజనాలు

హయత్‌నగర్, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని షిరిడీ పురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాస సామూహిక వన భోజనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కార్తీక మాస వన భోజనాల ప్రాముఖ్యతను విష్ణుమూర్తి వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన 19, 20వ వార్డు కౌన్సిలర్లు కవిత, ఉదయశ్రీలను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సునీల్‌శర్మ, కార్యదర్శి రాజేందర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో కార్తీక పూజలు

చంపాపేట : కార్తీకమాసం చివరి రోజును పురస్కరించుకొని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు ఆలయ పరిసరాలు, కోనేరులో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య, ఆదివారం కావడంతో భక్తులు ధ్యానాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ ఎన్.లావణ్య తెలిపారు.

మాజీ మున్సిపల్ చైర్మన్‌కు ఈటల ఘన నివాళి

చాదర్‌ఘాట్ : గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బద్దం ఎస్.సుభాష్‌రెడ్డి 5వ వర్థంతి సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్ చౌరస్తాలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, అందెల శ్రీరాములుయాదవ్, కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్‌లు సుభాష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా ఏఐఏడీ స్నాతకోత్సవాలు



జ్యోతి ప్రజల్వన చేస్తున్న ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ డి.ఎస్.స్వామి, సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్ కోతావార్

సైదాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ డెంటిస్ట్రీ(ఏఐఏడీ) సొసైటీ 13వ స్నాతకోత్సవాలు శనివారం రాత్రి చంపాపేటలోని సామ సరస్వతీ గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు(ఐడీఏ) డాక్టర్ డి.ఎస్.స్వామి, సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్ కోతావార్ హాజరయ్యారు. ఈ వేడుకల్లో కోర్సు పూర్తి చేసుకున్న దంత వైద్యులకు పట్టాలు ప్రదానం చేశారు. డాక్టర్ డి.ఎస్.స్వామి మాట్లాడుతూ ప్రతి డెంటిస్టు తాజా సాంకేతికతలు, ఆధునిక క్లినికల్ నైపుణ్యాల్లో నిపుణత కలిగి ఉండడం ముఖ్యమని అన్నారు. నైతిక విలువలతో కూడిన వైద్యులుగా మెరుగైన సేవలందించాలని, అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా మిడ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రతాప్‌కుమార్, ఐడీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చలపతిరావు హాజరుకాగా మాక్సిల్లోఫేషియల్ సర్జన్ డాక్టర్ నవీన్ కొక్కుల, డాక్టర్లు రాకేష్ మొహదే, అవినాష్ క్షర్, అనిల్‌కుమార్, సత్యనారాయణనాయుడు, యూజీ, పీజీ దంత వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువకుడి వీరంగం

● చంపాపేట ప్రధాన రహదారిపై ఘటన

సైదాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చంపాపేట ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ఓ యువకుడు హంగామా చేశాడు. గంజాయి మత్తులో ఉన్న అతడు రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై దాడులు చేస్తూ వీరంగం సృష్టించాడు. నడిరోడ్డుపై అటు ఇటు తిరుగుతూ బస్సులు, కార్లు, ఆటోలు, బైక్‌లు ఆపుతూ హైడ్రామా క్రియేట్ చేశాడు. సుమారు 20 నిమిషాల పాటు యువకుడు నానా హంగామా చేస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేశాడు. అతడి చర్యతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కానీ అందరూ చూస్తున్నారే తప్ప నిలువరించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు యువకుడే మెల్లగా అక్కడనుంచి జారుకున్నాడు. నడిరోడ్డుపై ఇంతా జరిగి ట్రాఫిక్ జాం కలిగినా సమీపంలో మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్నారే తప్ప స్పందించలేదని పలువురు వాపోయారు.



పరీక్ష చేస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో 10మంది పట్టివేత

● కారు, 9 బైకులు స్వాధీనం

కొత్తపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధి కామినేని ప్లై ఓవర్ వద్ద అల్కాపురి క్రాస్‌రోడ్స్, నాగోల్ - ఉప్పల్ వెళ్లే దారిలో శనివారం రాత్రి వాహన చోదకులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ఓ కారు డ్రైవరు సహా, 9మంది బైకు రైడర్లు పట్టుబడ్డారు. వారిని అల్కాపురి చౌరస్తా సమీపంలో సీపీ క్యాంపు కార్యాలయంలో గల ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ)లో కౌన్సెలింగ్‌కు అనంతరం తదుపరి చట్టపరమైన చర్యల కోసం కోర్టులో హాజరు కావాలని సూచించారు. ఈ డ్రైవ్‌లో ఎస్ఐ మధుసూదన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేద్దాం



అభివాదం చేస్తున్న మాదిగ నాయకులు


హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాదిగ నాయకుల సమావేశం ఇంజాపూర్‌లోని అభ్యుదయ సంఘంలో మాదిగ జేఏసీ నాయకుడు కొండ్రు పురుషోత్తం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం మాదిగ జేఏసీ ఏర్పాటు చేసిన నాయకులు బోసుపల్లి ప్రతాప్, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు రావుగళ్ల బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 10న ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాదిగల ఆత్మీయ సమ్మేళన సభకు మంద కృష్ణమాదిగ, ఉస్మానియా ఆర్ట్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీం హాజరవుతారని తెలిపారు. పెద్ద సంఖ్యలో మాదిగలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్లెల ఉపేందర్, బచ్చిగళ్ల రమేష్, బాలరాజ్, అర్జున్, బాలకిషన్, రఘు, రమేష్, అశోక్, యాదయ్య, కుమార్, జగదీష్, బాబు, సతీష్, రవి పాల్గొన్నారు.

మాలల సింహగర్జనకు మలక్‌పేట నుంచి భారీ ర్యాలీ

చాదర్‌ఘాట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మాలల సింహగర్జనకు మలక్‌పేట మాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అంతకుముందు ఆయన మూసారాంబాగ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనాథకు ఆత్మబంధువై అంత్యక్రియలు

● సేవాగుణం చాటుకున్న 'మాతృ దేవోభవ' గిరి



అభాగ్యుడికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆశ్రమం నిర్వాహకుడు గిరి, ఆయన కుటుంబ సభ్యులు

సరూర్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల మాతృదేవోభవ అనాథాశ్రమం నిర్వాహకుడు గట్టు గిరి ఓ అభాగ్యుడి పట్ల ఆత్మబంధువుగా నిలిచి అంత్యక్రియలు నిర్వహించారు. రెండు నెలల క్రితం నాగోల్ ప్రాంతంలో రోడ్డుపై పిచ్చోడిలా తిరుగుతున్న ఓ అభాగ్యుడిని ఆయన చేరదీసి తమ ఆశ్రమానికి తీసుకువచ్చి సపర్యలు చేశారు. మూగవాడైన సదరు అనాథ(65) వ్యక్తికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆహారం తీసుకోలేకపోయాడు. దాంతో ఆరోగ్యం క్షీణించి ఆదివారం ఉదయం కన్నుమూశాడు. దాంతో ఎవరూ లేని సదరు అభాగ్యుడికి నాదర్‌గుల్ 27వ డివిజన్ కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో ఆశ్రమం నిర్వాహకుడు గిరి అంత్యక్రియలు నిర్వహించారు. తన కుమారుడు అభిరామ్‌తో తలకొరివి పెట్టించి తన పెద్ద మనస్సును చాటుకున్నాడు. తనతో పాటు తన కుటుంబ సభ్యులు సైతం అభాగ్యుల సేవలో ముందుంటున్నామని ఈ సందర్భంగా గిరి పేర్కొన్నారు. కాగా గిరి సేవా గుణాన్ని స్థానికులు కొనియాడారు. ఎందరో అభాగ్యులకు ఆయన ఆపద్బాంధుడిగా నిలుస్తున్నారని అన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
రాజు : 99854 02786